క్లుప్తంగా

బీసీ హాస్టల్లో వైద్య పరీక్షలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహం- బీసీ (హాస్టల్)లో ఉన్న విద్యార్థులకు సోమవారం భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యురాలు మొహీసీనా తాజ్ పరీక్షలు వైద్య పరీక్షలు చేశారు. నాలుగు రోజుల క్రితం విద్యార్థులకు ఎలర్జీ రావడంతో వార్డెన్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎలర్జీ తగ్గిందా లేదా అని వైద్యురాలు ప్రతి ఒక్కరిని పరీక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బి.మంగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెకోనలో ఆర్మీ జవాన్‌కు నివాళి



పల్లెకోన(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన ఆర్మీ జవాన్ పురమా గోపరాజు ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆయన ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గాదె శివరామ కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, పల్లెకోన సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అకాల మరణం చెందిన మండలంలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు కనపర్తి నాగయ్య పార్థివదేహానికి వరికూటి నివాళులర్పించారు.

దాతల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

హెచ్‌ఎం సాంబశివరావు



బాపట్లటౌన్: దాతల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం పురం వెంకట సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని ప్రముఖ డాక్టర్ చల్లా రామ్మోహనరావు సోమవారం రూ.7 వేలు విలువైన విద్యుత్ మోటార్‌ను పాఠశాలకు బహూకరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, బి.ఎస్.రామకృష్ణ, మల్లేష్, రమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



తెనాలిరూరల్: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు పై కూటమి ప్రభుత్వం దాటవేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం తెనాలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ తెనాలి జోన్ కన్వీనర్ పుట్టా జనార్దనరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ చాన్‌బాషా మాట్లాడుతూ కూటమి మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటోందని, ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేసి, పెండింగ్ ఉన్న నాలుగు డీఏలలో రెండు విడుదల చేసినప్పుడు ఖచ్చితంగా ఇది మంచి ప్రభుత్వం అవుతుందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. టి.ఏసుబాబు, సి.హెచ్ లక్ష్మణ కుమార్, నరసింహారావు, పి. శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ప్రసాదరావు, శేఖర్, పూర్ణచంద్రరావు, సాంబశివరావు, శివనాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాసకుటిలో శ్రీరాముడి ధనుర్బాణాలు

తెనాలి: అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి వంశీకులచే కళ్యాణ రామమందిర నిర్మాణం జరుగుతున్న సందర్భంగా చేయించిన శ్రీరాముడి ధనుర్బాణాలు, పాదుకలను సోమవారం రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని దాసకుటి ఆశ్రమంలో భక్తులు దర్శించుకున్నారు. ఆంధ్రవాల్మీకి వాసుదాసు స్వామి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ మహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన చివరిరోజైన సోమవారం 16 కలశాలతో అభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు.

వర్షం పడితే.. కాలువలే..!

- రోడ్ల అంచుల వరకు ఆక్రమణలు
- డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తం
- రోడ్లపై తిష్ట వేస్తున్న వర్షపు నీటితో ప్రజల ఇక్కట్లు



కొల్లూరు లాక్ సెంటర్ వినాయకుడి ఆలయం రెండో వీధిలో నిలిచిన వర్షపు నీరు

కొల్లూరు: రోడ్ల అంచుల వరకు ఆక్రమణలు.. ప్రభుత్వ యంత్రాంగం అసమర్థత.. ప్రజల స్వార్థం వెరసి రహదారి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడంతోపాటు, ప్రజలు ప్రయాణ కష్టాలను రెట్టింపు చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి సంగతి అటుంచితే.. ఆర్ అండ్ బీ రోడ్లు, గ్రామాలలోని అంతర్గత రహదారుల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో వర్షం పడితే రోడ్లు తటాకాలు, కాలువలను తలపించేలా తయారవుతున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ నీటి కుంటలుగా దర్శనమిస్తుండటంతో ప్రజలు ప్రయాణ కష్టాలకు గురవడంతోపాటు, అధ్వానంగా ఉన్న రహదారులు పూర్తిగా ఛిద్రమవుతున్నాయి. మండల కేంద్రంతోపాటు, గ్రామీణ ప్రాంతాల వరకు ఆర్ అండ్ బీ రహదారులు, అంతర్గత సీసీ రోడ్ల అంచుల వరకు ఆక్రమణలు స్మృతిమించి పోవడంతో రోడ్లపై నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. పంచాయతీ, ఆర్ అండ్ బీ స్థలాలను సైతం ఒదలకుండా రోడ్లను మించిన మెరకలు వేయడం, ప్రతి ఇంటి ముందు రోడ్డుపైకి నీరు పారేలా సిమెంట్ ర్యాంపులు నిర్మించడంతో రోడ్లపై నీరు రోజుల తరబడి తిష్టవేసి దోమలు, దుర్గంధాల వ్యాప్తికి కారణమవుతున్నాయి.



పెసర్లంక ఆర్ అండ్ బీ రోడ్డులో...

వీటికి తోడు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో అంతర్గత రహదారులు వర్షపు నీటితో నిండిపోయి మడుగులను తలపిస్తున్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి రహదారులను ఆక్రమించి వేసిన మెరకలను తొలగించి, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.



కొల్లూరు జెండా చెట్టు వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న నీరు

పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించి మాట్లాడారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ గ్రామంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలని, ఒక అర్జీ, రేపల్లె పురపాలక సంఘానికి చెందిన మోహన్‌రావు అనే వ్యక్తి రేపల్లె మండలం బేతపూడి గ్రామం నుంచి తురకపాలెం వరకు వీధి దీపాలు ఏర్పాటు చెయ్యాలని అర్జీ, నగరం మండలం న్యూ అంబేడ్కర్ కాలనీకి చెందిన డొక్కా శ్రీనివాసరావు గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చెయ్యాలని, భట్టిప్రోలు గ్రామానికి చెందిన బొట్టు నాగమల్లేశ్వరరావు ఆయుర్వేద వైద్య శాల వెనుక వర్షపు నీటిని తొలగించాలని, రేపల్లె పట్టణంలోని 12వ వార్డులో ఎంసీఏ ఫంక్షన్ హాల్ నుంచి వచ్చే మురుగు నీరు, వర్షపు నీరు వల్ల దుర్వాసన వస్తుందని అర్జీ అందించారని తెలిపారు. వచ్చిన ఐదు అర్జీలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించనున్నట్టు రామలక్ష్మి పేర్కొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

భట్టిప్రోలులో కొనసాగిన స్కూల్ గేమ్స్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీహెచ్‌సీ వైద్యులు మొహీసీనా తాజ్



కబడ్డీ పోటీలో తలపడుతున్న అండర్-17 విభాగంలో క్రీడాకారులు

భట్టిప్రోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు రెండవ రోజు సోమవారం మండల స్థాయి ఆటల పోటీలు భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్-14, 17 క్యాటగిరీ కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలు జరిగాయి. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు మొహీసీనా తాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలలో మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 96 మంది బాపట్ల డివిజన్‌కు ఎంపికయ్యారు. మండల కో ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ మంగళవారం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగా, చెస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు, పీడీ తుమ్మా శ్రీనివాసరెడ్డి, పీఈటీలు ఎండీ అనూల్‌హక్, జీవీఎస్ నాగేశ్వరరావు, పడమటి బాబు, హరిప్రసాద్, వి.శ్రీనివాసరావు, పద్మ, లక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, లక్ష్మీపార్వతి, సత్యరత్న, మురళీధరరావు, రమ్య, కరస్పాండెంట్ మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు. సీహెచ్‌వో బి.మంగరాజు, ఆశా కార్యకర్తలు ఎన్.లీలాకుమారి, ఎం.సరస్వతి, పి.కలిమిలా రాణిలు క్రీడాకారులకు వైద్య సేవలు అందించారు. మధ్యాహ్నం ఏఎస్‌ఐ రామకృష్ణ, రైటర్ సైకం నాగరాజు, సిబ్బంది పాల్గొని క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అలాగే పోలీస్, వైద్య ఆరోగ్య సిబ్బంది పోటీలలో ఆడి తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు.


విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి:ఎంఈఓ

చెరుకుపల్లి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే వారికి ప్రభుత్వ కొలువుల్లో చేరేందుకు అవకాశం ఉంటుందని ఎంఈవో పులి లాజర్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో సోమవారం నిర్వహించిన ఆటల పోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో లాజర్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను పట్టించుకోకుండా వారిలో ఉన్న క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ క్రీడలకు మండల లోని వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14, 17 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయికి పంపనున్నారు. మంగళవారం అండర్-14, 17 విభాగాల్లో బాలికలు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాటూరు లక్ష్మీనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు కాటూరు శ్రీనివాసరావు, వి.నాగరాజు, కూరేటి సత్యన్నారాయణ, టి.బుచ్చిరెడ్డి, పీడీఎల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలి

కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్

తెనాలిరూరల్: విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదరావూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కంపెనీని సోమవారం ప్రారంభించారు. ముఖ్యతిథిగా పాల్గొన్న కల్నల్ ఉదయ్ కుమార్ విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విధివిధానాల గురించి వివరించారు. ఈ సందర్భంగా స్కౌట్ వ్యవస్థాపకులు బ్రిడెన్‌పాల్ చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్కౌట్స్ యూనిఫామ్ బహూకరించారు. నూతనంగా చేరిన విద్యార్థులతో ఆరంభ వేడుక నిర్వహించి ప్రమాణం చేయించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవాభావం పొందించడానికి స్కౌట్ అండ్ గైడ్ ఉద్యమం ఎంతగానో ఉపయోగపడుతుందని కల్నల్ ఉదయ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సరళ, సుబేదార్‌లు గురుదీప్‌కుమార్, సురేంద్రసింగ్, హవల్దార్‌లు సోహన్ కుమార్, నాగరాజు, కె.ఎస్.రెడ్డి, ఎస్.రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఏర్పాటు చేసిన నూతన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కంపెనీ

పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను తెలుసుకుని నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించినవి 5, మున్సిపాలిటీ పరిధిలో 5, పోలీసు శాఖ 3, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అర్జీలు ఒక్కోటి చొప్పున మొత్తం 15 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈలపై వర్క్‌షాప్

తెనాలి: భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. ఎంఎస్ఎంఈలుగా పిలుచుకునే ఈ పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా 'రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మార్మెన్స్' అనే పేరుతో పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో ఉద్యమ రిజిస్ట్రేషను కీలకం. దీనిపై అవగాహన కల్పించేందుకు సోమ వారం పట్టణ చెంచుపేటలోని కమ్యూనిటీ హాలులో వర్క్‌షాపును నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, చెంచుపేట బ్రాంచి మేనేజరు ధనావతు కిషన్‌లు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలు ఎందుకు? ఎవరు ఏర్పాటుచేయాలి? రిజిస్ట్రేషన్ ఆవశ్యకత ఏమిటి? ప్రభుత్వం నుంచి లభించే సౌకర్యాలు ఏమిటనే అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు కర్రసాము శిక్షణ



తెనాలి: పట్టణంలోని హరి హంసిక డాన్స్ అండ్ తైక్వాండో ఇన్‌స్టిట్యూట్ 37వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఇన్‌స్టిట్యూట్ మాస్టర్ ఎం.చిన్న విద్యార్థులకు ప్రాచీన యుద్ధ కళ కర్రసామును ప్రత్యేకంగా పరిచ యం చేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ కర్రసాము సంభయ్య మాస్టారు, విద్యార్థులకు కర్రసాముపై ఒక ప్రత్యేక శిక్షణా సెషన్‌ను నిర్వహించారు. కర్రసాము అనే ఈ ప్రాచీన యుద్ధకళ అంతరించిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో మాస్టర్ ఎం.చిన్న తనను ఆహ్వానించినందుకు సంతోషంగా ఉందని సంభయ్య అన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లోని పిల్లలు క్రమశిక్షణతో నేర్చుకుంటున్న తీరు ప్రశంసనీయమని చెబుతూ, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. స్వీయరక్షణ కోసం కర్రసాము ఎంతో ఉపయోగకరమని మాస్టర్ ఎం.చిన్న చెప్పారు. శిక్షణ అందించిన డాక్టర్ కర్రసాము సంభయ్యకు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు.

విద్యార్థులు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- ఘనంగా ఇంజనీరింగ్ డే వేడుకలు
- ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల మాజీ ఏడీ డాక్టర్ శివాలకుమార్



మాట్లాడుతున్న డాక్టర్ శివాలకుమార్

బాపట్లటౌన్: విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఎన్జీఆర్ ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాల విశ్రాంత అసోసియేట్ డీన్ డాక్టర్ శివాలకుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ శివాలకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి మేధా నైపుణ్యంతో సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడే టెక్నాలజీలను తయారు చేయడం ద్వారానే ఇంజనీరింగ్ విద్యకు సార్ధకత ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ డి.భాస్కరరావు, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు, డాక్టర్ ఎన్జీఆర్ సీఎఫ్ఎస్‌టీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్, అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలు, రోడ్ల నిర్మాణాలు చేయండి

తెనాలిఅర్బన్: 28వ వార్డులో మురుగు కాల్వలు, 3వ వార్డులో కొత్త సీసీ రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 16వ వార్డులో వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంటుందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, పెన్షన్ మంజూరు చేయాలని, తదితర అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొవ్వా యేసుబాబు, ఏసీపీ వాణి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కొల్లూరు : పారిశుధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పనలో ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని సీఐటీయూ నాయకుడు బొనిగల సుబ్బారావు అన్నారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పారిశుధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులు పనులు చేసే క్రమంలో ప్రమాదాల బారిన పడితే కనీసం టించర్ కూడా అందుబాటులో ఉండకపోవడం దారుణమన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో కార్మికులు చేసే పని ఒకటే అయినా వేతనాలలో వ్యత్యాసం ఉండటం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికులుకు అవసరమైన యూనిఫాం, గుర్తింపు కార్డులు, కొబ్బరినూనె, చెప్పులు, సబ్బులు, రూ.10 లక్షల బీమా, దహన సంస్కారాలకు రూ.20 వేలు, చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రేపల్లె జోన్ కన్వీనర్ తేలప్రోలు శ్రీనివాసరావు

రేపల్లె(చెరుకుపల్లి): ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మాట్లాడకపోవటం శోచనీయమని ఏపీటీఎఫ్ రేపల్లె జోన్ కన్వీనర్ తేలప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఏపీటీఎఫ్ రేపల్లె జోన్ ఆధ్వర్యంలో ఐదవ రోజు తాలూకా స్థాయిలో తాలూకా కేంద్రం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయి పడిన నాలుగు డీఏలు ఇంతవరకు చెల్లించకపోవటం దురదృష్టకరమని, ఇల్లులు దరఖాస్తు చేసి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు మంజూరు కాకపోవటం అప్రజాస్వామికమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్సీ కమిటీని నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు చెయ్యాలని, పాఠశాలల్లో అనవసర యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్బారావు, కార్యదర్శి వై.చెన్నకేశవులు, ఏపీటీఎఫ్ పాత తాలూకా పరిధిలోని భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, రేపల్లె, కొల్లూరు, చెరుకుపల్లి మండలాల బాధ్యులు రాంబాబు, వెంకటరత్నం, షేషు తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కేంద్రం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తొలగించిన పేర్లను అడంగల్‌లో నమోదు చేయాలి

రేపల్లె: పూర్వం నుంచి దేవాలయాల్లో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న అర్చకులు, అర్చకేతరులకు కేటాయించిన భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేర్లు తొలగించటం చట్ట విరుద్ధమని నవ్యాంధ్ర అర్చక, ఇనాందారుల సేవా సమితి అధ్యక్షుడు నారాయణం శరత్‌చంద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అర్చకులు, అర్చకేతరులు ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కేటాయించిన సర్వీస్ ఇనాం భూములను అర్చకులే రక్షిస్తూ వాటిని సాగు చేసుకుంటూ అందులో వచ్చిన ఫలసాయాన్ని అనుభవిస్తూ స్వామి వారికి సేవలు చేస్తున్నామని తెలిపారు. గతంలో అర్చకులు, అర్చకేతరుల పేర్లను అడంగల్‌లో నమోదు చేసి వారి పేర్లతోనే నీటి తీరువా శిస్తు కట్టించుకునేవారని, అయితే 2015లో దేవదాయ శాఖ రీకన్సలేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి అనుభవదారులుగా ఉన్న అర్చకులు, అర్చకేతరుల పేర్లు ఆన్‌లైన్ నుంచి తొలగించిందని అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందటం లేదని, కావున గతంలో తొలగించిన పేర్లను అడంగల్‌లో నమోదు చేసి శిస్తు కట్టించుకోవాలని కోరారు.



ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న రేపల్లె అర్చకులు, అర్చకేతరులు

మహిళలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ సమంత కడియాల

చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంతంలో 21 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి మహిళ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని అమెరికా క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సమంత కడియాల సూచించారు. మండల కేంద్రంలోని గుళ్ళపల్లి శ్రీరామచంద్ర నర్సింగ్ హోమ్‌లో సీనియర్ వైద్యులు డాక్టర్ కొడాలి వరప్రసాద్ జ్ఞాపకార్థం డాక్టర్ కొడాలి రజనీకాంత్, డాక్టర్ విజయలక్ష్మి సౌజన్యంతో అమెరికాలోని పింక్ సంస్థ, పూర్ణసుధ క్యాన్సర్ ఫౌండేషన్ సారథ్యంలో సోమవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా మాజీ శాసన సభ్యుడు ముమ్మనేని వెంకట సుబ్బయ్య, పలువురు వైద్యులు డాక్టర్ కొడాలి వరప్రసాద్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించి ఆయన పేదలకు చేసిన వైద్య సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ సమంత మాట్లాడుతూ మహిళలకు గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము క్యాన్సర్ పరీక్షలకు నాలుగు రోజుల పాటు ఈ వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొడాలి గోపాలకృష్ణ, డాక్టర్‌లు కొడాలి మోహన్, కీర్తి చంద్రా, రమ్య, వాసిరెడ్డి నవ్య, జ్యోత్స్న, బెంగళూరు క్యాన్సర్ వైద్యురాలు డాక్టర్ జయంతి, అమెరికా డాక్టర్లు జాన్ టుబ్లోట్, కారల్ హోంబక్, లూయిస్ స్కోరి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంలో వైద్యులు